# మూడే
# రంగులు

కోలాయి కటితేనేమీ

మా గాంధి కోమటై పుట్టితేనేమీ

వెన్నపూసా మనసు కన్న తల్లీ ప్రేమ

పండంటి మోముపై బ్రహ్మ తేజస్సు....

ఒసే. అప్పలమ్మా- గాంధీగారెవరో తెల్సంటే నీకూ?

నాకు సూపునేదు. నా కేటెరిక తల్లీ!

షావుకారు సుబ్బయ్య కొట్లో గోడను వ్రేలాడుతూ వుంటుందే ఫొటో వెర్రిమొహమా.

గింజలు కొలిపించుకునేప్పుడు తలకాస పైకెత్తి చూదే సన్నాసీ!

ఇంకెన్నాళ్ళురా మీకీ కష్టాలూ- అంటూ కన్న తల్లి ప్రేమలా. వెన్నెలలా బోసినవ్వులు విర జిమ్మే ఆబాబేనా.

కొల్లాయి కట్టినా.
సర్వంసహాచక్రవర్తి కుండే ఠీవితో
పుడమి తల్లిగుండెల మీద చేతికర్రను
టకటకా మోగించుకుంటూ నడిచే బాబు
ఆబాబేసే మన కన్నతండ్రి-మన ఇలవేల్పు.
మన కన్న తల్లి చెర విడిపించి
మన చేతి బానిస సంకెళ్ళను పటాపంచాలు
చేసిన మహా మహిమాన్వితమూర్తి
మహా మనీషి ...

వాడేనే చెలి వాడేనే

అప్పలమ్మా నీకింకా తెలీదూ?
నీకు దేశభక్తి లేదు.
అస్తమాను గంజో గంజో ఆకలో ఆకలో
అంటూ ఏడుస్తూ కూర్చుంటావు.

నీలాంటి దేశభక్తి లేనివాళ్ళను మరతుపాకిపెట్టి పేల్చెయ్యాలే - రాస్కెల్:

* * *

గుడిసెలో తొంగుని చూరులోంచి చందమామనూ, చుక్కలనూ లెక్కపెట్టడం కాదురా బ్రేక్:

హౌవోల్డారూ్య —

మనకు స్వాతంత్రం వచ్చి ఎన్నాళ్ళయింది?

నీకు పండిట్ జవహర్లాల్ నెహ్రూ అంటే ఎవరో తెలుసుట్రా?

ఏయ్ రిక్షావాలా —

కాలవంటే తెలుసుకదా!

నహర్ అంటె కాలవట.

కాలవ పక్కనుండే వాళ్లు కనుక నెహ్రూలన్నారట:

కాలవ పక్కనుండే మీవాళ్ళంతా నెహ్రూ లౌతారంట్రా ఇడియట్!

జవహరంటే రత్నంరా రత్నం —

మానవజాతి నెత్తురు నేలమీద

ప్రవహించ కూడదన్నాడ్రా

కత్తులూ కటార్లూ

తుపాకులూ మర తుపాకులూ

టాంకులూ బాంబులూ విమానాల కంటే

మైత్రీ సూత్ర బంధమే గట్టి దన్నాడ్రా
తన వయసూ వలపూ
మనసూ మమతా దేశాని కర్పించేసి
యౌవ్వనమంతా కటకటాల వెనుక
గడి పేశాడ్రా మహానుభావుడు
జవహర్లాల్ నెహ్రూరా
మొక్కు చెయ్యెత్తి మొక్కరా రాస్కెల్
ఒరేయ్ ఎర్ర గులాబీ చూసావా అని
అడుగుతున్నాను. ఎక్కడ-
ఆ రాజరాజ నరేంద్రుడు
ఆ మన్మధ మన్మథుడు.
ఆ భారత ప్రజాహృదయాధిష్టాన మూర్తి
జాతి రత్నం. గుండెలమీద
కోటు గుండీల మీద గుచ్చిన
ఎర్ర గులాబీ చూసేవా అని అడుగుతున్నానురా ఫూల్!

కేరీ ఆన్ - రిక్షా లాగితే లాగేవు కానీ ఆదారి బాబుని తల్చుకుని పోతూ పోతూ మన ముచ్చటైన మూడు రంగుల జండాకో సెల్యూట్ పారేయ్!

*　　　*　　　*

మంత్రసాని నరసమ్మా నీ పని పురుళ్ళు పొయ్యడమే!
పొత్తిళ్ళలో పెట్టి బిడ్డలను తల్లుల కప్పగించి కట్న కానుకలు

అడిగి పుచ్చుకుంటున్నావుకదా. అందులో ఎంతమంది దొంగలు, దేశ ద్రోహులు, బ్లాక్ మార్కెటీర్లవుతున్నారో, ఎంతమందిమాతృ శ్రీకి కష్ట కాలంలో ఆమెకునే బిడ్డలవుతున్నారో చెప్పగలవా నరసమ్మా:

యు కాంట్ —

రాజ్య చక్రం చేపట్టిన
పద్దెనిమిది మాసాలలో
పద్దెనిమిది సంవత్సరాల నైపుణ్యా
సామర్థ్యాన్ని మించిపోయేలా
పరిపాలించిన
మేరునగధీరుడు
జన్మతః పొట్టివాడైనా
ప్రపంచం దృష్టిలో
ఆకాశమంత ఎత్తు ఎదిగినవాడు,
ఆ లాల్ బహదూర్ శాస్త్రి, కన్నతల్లికి
ఉగ్గుపాలు పోసిన మంత్రసానికి ఏమిచ్చి
భారతజాతి ఋణం తీర్చుకోగలదో
చెప్పగలవా నరసమ్మా?

యు కాంట్ —

నరసమ్మా మైడియర్ నరసమ్మా ప్లీజ్ — ఎబార్షన్ చేసి. లూపులు బిగించి. ఇంకా ఏమేమోచేసి ఒక గాంధీని ఒక నెహ్రూని. ఒక టాగూరుని. మరో లాల్ బహదూర్‌ని మనకు మళ్ళీమళ్ళీ లేకుండా చేయమని చేతులో చేయ్యేసి చెప్పండమ్మా! దొంగల్ని రాస్కెల్సుని దేశంలో వదిలి మంచివాళ్లు మహాత్ములు పుట్టకుండా పోతె మీ కుటుంబనియంత్రణాలు మనజాతికి కీడేచేస్తాయో మేలేచేస్తాయో సంవత్సరం పాటు పిల్లల్నికనొద్దన్న మంత్రి పుంగవుడ్ని చెప్పమనండి—

కన్న తల్లులంతా నిలేసి అడుగుతున్నారు. కనే తల్లీనీకు గౌరవం పోయిందమ్మా—